ప్రజా పక్షం..

TS-27-0016491

జయ జయహే

# సూర్యోదయం

ప్రజా గొంతు..

హైదరాబాద్ | సంపుటి -2 | సంచిక -20 | పేజీలు : 8 | ఎడిటర్ : శివకృష్ణ | బుధవారం 15 ఏప్రిల్ 2026 | వెల : 4/-



## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న సూర్యోదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 9515342857


## అపెక్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# అంబేద్కర్ జయంతి వేడుకలు

### ప్రజాసేవయే లక్ష్యంగా కొనసాగుతాం

### ఎ సి టీ వ్యవస్థాపక అధ్యక్షులు అడ్వకేట్ మాధవ్





పటాన్‌చెరు సూర్యోదయం న్యూస్ :- ఏప్రిల్ 14 2026

ఇంద్రేశం, అరతి నగర్ కాలనీలో అపెక్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వేసవి కాలంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇంద్రేశం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పట్లోళ్ల హరీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవనే లక్ష్యంగా తీసుకుని పనిచేస్తున్న ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. సమాజ సేవకు అంకితభావంతో ముందుకు వస్తున్న అడ్వకేట్ మాధవ్ కు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు అడ్వకేట్ మాధవ్ మాట్లాడుతూ, మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితోనే ఈ సంస్థను స్థాపించామని తెలిపారు. సేవా కార్యక్రమాలే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతూ భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవలు చేపడతామని చెప్పారు. వేసవి కాలం ముగిసే వరకు చలివేంద్రం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలు మరియు అరతి నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఐలాపురం నాగరాజ్



పటాన్ చేరు సూర్యోదయం న్యూస్ :- ఏప్రిల్ 14 2026

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకొని మంగళవారం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధి వీకర్ సెక్షన్ కాలనీలో గల అంబేద్కర్ విగ్రహానికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఐలాపురం నాగరాజు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు రూపుమాపి అందరికీ సమ న్యాయం అందించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. నేటితరం యువత అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో..స్థానిక కాంగ్రెస్ నాయకులు ఐలాపురం నాగరాజు, రఘునాయక్,స్వామి,సతీష్ గౌడ్, ఎస్సీ సంఘం అధ్యక్షులు ఉషయ్య,ఉప ఉపాధ్యక్షులు డప్పు నరసింహులు,బాలరాజ్, యూత్ కాంగ్రెస్ లీడర్,పర్శరాములు, ఎరుపుల నాగరాజు, విట్టల్, దాసు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రోజా సెకండ్ ఇన్నింగ్స్...

చెన్నై

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి రోజా వేరే ఆలోచనతో ఉన్నట్టు కనిపిస్తున్నారు. ముఖ్యంగా తమిళ రాజకీయాలను ఒక ఆప్షన్ గా పెట్టుకున్నారు. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తనను విస్మరిస్తే వెంటనే తమిళ రాజకీయాల్లోకి వెళ్లాలని ఆలోచన చేస్తున్నట్టు ఉన్నారు. ఎందుకంటే రోజాకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో వచ్చే ఎన్నికల్లో సీటు దక్కుతుందా లేదా అనే అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న నగిరిలో టిడిపి పట్టు బిగిస్తోంది. మరోవైపు రోజా నాయకత్వాన్ని స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ క్యాడర్ వ్యతిరేకిస్తోంది. అందుకే జగన్మోహన్ రెడ్డి పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. అందుకే టిక్కెట్ల విషయంలో ఎటువంటి మొహమాటాలకు పోదలుచుకోలేదు జగన్మోహన్ రెడ్డి.మొన్నటి ఎన్నికల్లోనే రోజాకు నగిరి టికెట్ వస్తుందా లేదా అన్న అనుమానాలు వెంటాడాయి. అయితే ఈసారి తప్పకుండా రోజాను తప్పించాల్సిందేనని ఆ జిల్లాకు చెందిన సీనియర్ మాజీమంత్రి ఒకరు గట్టిగానే జగన్మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లోనే రోజాకు టికెట్ వద్దని వారించారట. కానీ ఆమెకు టికెట్ ఇవ్వకపోతే నెగిటివ్ ఫీడ్బ్యాక్ వెళుతుందని భావించి జగన్మోహన్ రెడ్డి ఆమెకు టికెట్ ఇచ్చారు. అయితే ఈసారి మాత్రం ఆమెకు టికెట్ లేదని స్పష్టంగా తెలుస్తోంది. అందుకే సెకండ్ ఆప్షన్ గా రోజా తమిళ రాజకీయాలను ఎంపిక చేసుకున్నారు. తాజాగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డిఎంకె తరఫున ప్రచారం చేస్తున్నారు రోజా. ఇదంతా ముందు చూపులో భాగమేనని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.రోజా భర్త సెల్వమణి తమిళ దర్శకుడు. అక్కడ సినిమా రంగంతో పాటు రాజకీయ రంగాల్లో ఆయనకు పరిచయాలు ఎక్కువ. రోజా సైతం తమిళనాడులో నటిగా గుర్తింపు పొందారు. ఆమె ఆది నుంచి సీఎం స్టాలిన్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారు. ఆమెను స్టాలిన్ సోదరిగా చూస్తారు. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీలో మొండి చేయి చూపితే.. వెంటనే తమిళ రాజకీయాల్లో ఎంట్రీ ఇవ్వాలని రోజా భావిస్తున్నారట. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం భిన్నంగా ఆలోచిస్తోంది ఆమె విషయంలో. ఒకవేళ పార్టీలో కొనసాగితే కొనసాగని.. లేకుంటే వెళ్లిపోని అని సింపుల్ గా తీసుకుంటుందట. పైగా ఏపీ రాజకీయాలతో విసిగిపోయిన రోజా.. సెకండ్ ఇన్నింగ్స్ తమిళ రాజకీయాలు అని పొలిటికల్,సినీ వర్గాల్లో ఒక చర్చ నడుస్తోంది. చూడాలి ఆమె ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో..

## తమిళ ఎన్నికలకు ధురంధర్ లింక్

చెన్నై

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో మూడు రాష్ట్రాలు కేరళ, పాండిచ్చేరి, అస్సాం రాష్ట్రల ఎన్నికలు ముగిశాయి. తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాలు చాలా కీలకంగా మారాయి. బెంగాల్‌లో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇక తమిళనలడులో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేస్తోంది. ఇక్కడ నామినేషన్ల పూర్తయ్యాక అన్ని పార్టీలు ప్రచారంపై దృష్టి పెట్టాయి. డీఎంకే, ఏఐఏడీఎంకే లాంటి ద్రవిడ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు వ్యూహాలు రూపొందిస్తుంటే, హిందీ సినిమా 'దురంధర్' ద్రవిడవాద పార్టీను భయపెడుతోంది.దురంధర్ సినిమా అంటే పాకిస్తాన్ భయపడాలి. ఇందులో భారత దేశభక్తి, పాకిస్తాన్‌లో మన ఏజెంట్లు చేస్తున్న ఆపరేషన్లతో ఇప్పటికే పాకిస్తాన్ హడలెత్తిపోతోంది. సినిమాను నిషేధించింది. తమిళనాడులోని ద్రవిడవాద పార్టీలు సినిమా విడుదలను ఆపమని కోర్టుల్లో పిటిషన్లు వేశాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా రిలీజ్ చేయవద్దని డిమాండ్ చేశాయి. ఎన్నికలయ్యే వరకు ఆపాలని వాదించాయి, ఎందుకంటే సినిమా బీజేపీకి అనుకూల ఓట్లు తెచ్చి, మిత్రపక్షాలకు లాభం చేస్తుందని భావిస్తున్నాయి.

# మా పార్టీ కార్యాలయాన్నే ప్రభుత్వ భూమి పేరుతో కూల్చడం అన్యాయం

### ఐలపూర్ మాణిక్ యాదవ్ కారుని కూడా ధ్వంసం చేయడం దారుణం

### ప్రజల దాహర్తిని తీర్చే ఆర్వో ప్లాంట్ కూల్చివేతను ఖండిస్తున్నాం

### పటాన్ చేరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి





అమీన్ పూర్ సూర్యోదయం న్యూస్ : - ఏప్రిల్ 14 2026

పటాన్ చేరు నియోజకవర్గం ఐలాపూర్ గ్రామంలో హైడ్రా చర్యలను మరియు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ యువ నాయకుడు మాణిక్ యాదవ్‌కు చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వ భూమి పేరుతో అక్రమంగా కూల్చివేయడం అన్యాయమని అన్నారు. అయితే ఆ స్థలం 1954 నుండి వారి పూర్వీకుల సొంతమని, భూ భారతి పోర్టల్ సహా అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఈ విధంగా కూల్చివేతలకు పాల్పడటం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని విమర్శించారు. ఇప్పటికే కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. అలాగే, మాణిక్ యాదవ్ కారును ధ్వంసం చేయడం, సిద్దు అనే వ్యక్తి జీవనాధారం అయిన ఆర్,ఓ ప్లాంట్‌ను కూల్చివేయడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. అదే సర్వే నంబర్‌లో ఉన్న కొన్ని నిర్మాణాలను వదిలిపెట్టడం ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని చూపుతోందని అన్నారు. అదేవిధంగా, అక్కడ నివసిస్తున్న కిరాయిదారులకు తమ సామగ్రిని బయటకు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా హఠాత్తుగా కూల్చివేతలు చేపట్టడం అత్యంత అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కేవలం ఇళ్లను మాత్రమే లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలు చేపడుతున్నారని, రియల్ ఎస్టేట్ రంగం ఇప్పటికే మందగమనం లో ఉన్న సమయంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. నిజమైన ప్రభుత్వ భూములను గుర్తించి చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్,నర్సింహ, అప్పల భాస్కర్,మాజీ సర్పంచ్ రాజు,అమీన్ పూర్ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి,బిజిలిపురం రాజు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద రాజు,శివ,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.